మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


కమ్యూనిటీహాల్‌ శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్‌

బోడుప్పల్‌: దశలవారీగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. 26వ డివిజన్‌లో రూ.10లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్‌ నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని డివిజన్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్‌, కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, శోభారాణి వెంకటేశ్‌గుప్తా, కాలనీవాసులు పాల్గొన్నారు.

నియామకం

మల్లాపూర్‌: భాగ్యనగర్‌ గణేష్‌ ఉత్సవ కమిటీ మల్లాపూర్‌ డివిజన్‌ గణేష్‌ ఉత్సవ సమితి కన్వీనర్‌గా కేశవరం ఆంజనేయులు ఎన్నికయ్యారు. కో– కన్వీనర్లుగా నెహ్రూనగర్‌కు చెందిన రవిగంగాధర్‌, ఓల్డ్‌ మల్లాపూర్‌కు చెందిన కాంత్రికుమార్‌ నియామితులయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. గణేష్‌ మండపాల నిర్వాహకులు పోలీసులు సూచించే నియమనిబంధనలు పాటించాలన్నారు. అనంతరం పలువురు బీజేపీ నేతలు ఆంజనేయులను సత్కరించారు.

నిమజ్జన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష

ఉప్పల్‌: వినాయక చవితి పండుగ నుంచి నిమజ్జనం పూర్తయ్యేవరకు అధికారులు, పోలీసులు సమన్వయంతో ముందుకెళ్లి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. శనివారం ఉప్పల్‌ మున్సిపల్‌ కార్యాలయంలో డీసీ ఆంజనేయులు అధ్యక్షతన వినాయక చవితి, నిమజ్జనం ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎలక్షన్‌రెడ్డి, ట్రాఫిక్‌ సీఐ లక్ష్మీమాధురి, ఈఈ నాగేందర్‌, ఎమ్మార్వో వాణిరెడ్డి, కార్పొరేటర్లు బన్నాల గీతాప్రవీణ్‌, బండారు శ్రీవాణి వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌గౌడ్‌

మల్లాపూర్‌: బీజేపీ సభ్యత్వ నమోదును నేటి నుంచి ముమ్మరం చేయాలని మేడ్చల్‌ జిల్లా సభ్యత్వ నమోదు సభ్యుడు గోపాల్‌గౌడ్‌ సూచించారు. మల్లాపూర్‌ డివిజన్‌ బీజేపీ ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై శనివారం మల్లాపూర్‌లోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్‌ ఫంక్షన్‌హాల్‌లో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిలతో కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిగా గోపాల్‌గౌడ్‌ హాజరై మాట్లాడుతూ.. ఉప్పల్‌ నియోజకవర్గంలోనే మల్లాపూర్‌లో సభ్యత్వ నమోదు ఎక్కువగా చేయించి అందరికి ఆదర్శంగా నిలువలన్నారు. బీజేపీ సీనియర్‌ నేతలు శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, రాంచందర్‌, నర్సింహ, శైలేష్‌రెడ్డి, వెంకటేష్‌, సుజాత, మాధవి, సబిత, డివిజన్‌ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవి ఆరుద్ర జయంతి వేడుకలు

కాప్రా: అభ్యుదయ రచయిత, కవి ఆరుద్ర 99వ జయంతి వేడుకలు కమలానగర్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్‌ ఆధ్వర్యంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆరుద్ర రాసిన త్వమేహం కవితల పుస్తకం తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. గొడుగు యాదగిరిరావు, పద్మ, శ్రీమన్నారాయణ, జయరాజు, చందన్‌రాజు, హరిప్రసాద్‌, శారద, గౌస్య, శ్రీనివాసరావు, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌ కమిషనర్‌ పర్యటన


నల్లచెరువు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోను పరిశీలిస్తున్న జెడ్సీ హేమంత్‌పాటిల్‌, ఈఈ నాగేందర్‌

ఉప్పల్‌: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో అర్ధరాత్రి నుంచి భారీ వర్షాల సూచనతో ఉప్పల్‌ జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఎల్‌బీనగర్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌పాటిల్‌, ఉప్పల్‌ ఈఈ నాగేందర్‌, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్‌తో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలించి అప్రమత్తం చేశారు. ఉప్పల్‌ నల్ల చెరువులోకి ఇన్‌ఫ్లో, అవుట్‌ ఫ్లోను పరిశీలించారు. ఉప్పల్‌ సర్కిల్‌ పరిధిలో దాదాపుగా అన్ని ప్రాంతాల్లో పర్యటించి కిందిస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు.

అంగన్‌వాడీల ఆందోళన


వినాయక్‌నగర్‌ అంగన్‌వాడీ స్కూల్‌ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

అల్వాల్‌: 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌ తగ్గించి ఇచ్చే నిర్ణయాన్ని మానుకోవాలని వినాయక్‌నగర్‌ అంగన్‌వాడీ స్కూల్‌ వద్ద అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌ యూనియన్‌ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్‌ జిల్లా కార్యదర్శి శోభారాణి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ.. చిన్నపిల్లలకు విద్యాబోధనను అందిస్తూ.. గత 40 ఏళ్లుగా అనేక సేవలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను జూలై 1 నుంచి విధులకు హాజరు కావొద్దని సర్క్యులర్‌ జారీ చేశామన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే మానుకొని అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ. లక్ష అందించాలని లేదంటే సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్‌ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్‌ నాయకులు మీనాక్షి, వనజ, రమాదేవి, శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తం


కార్యక్రమంలో పాల్గొన్న మేయర్‌, కమిషనర్‌ (ఫైల్‌)

బోడుప్పల్‌: బోడుప్పల్‌ నగర పాలక సంస్థ పరిశుభ్రత, పచ్చదనానికి అధిక ప్రాధాన్యత నిస్తుంది. కాలనీలు, రోడ్లు, ఖాళీ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రంగా ఉండేందుకు కృషిచేస్తుంది. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం చేపడుతూ.. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వచ్చే సీజనల్‌ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనానికి ప్రాధాన్యం..

దోమల ద్వారా వచ్చే వ్యాధుల నివారణకు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఆగస్టు 5 నుంచి 9 వరకు అన్ని కాలనీల్లో స్వచ్ఛదనం, పచ్చదనం నిర్వహించారు. దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా (బోధకాలు) చికెన్‌గున్యా, డెంగీ, మెదడువాపు వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, నివారణ చర్యల్లో భాగంగానే శుక్రవారం డ్రై డేగా చేపడుతున్నామని అధికారులు పేర్కొన్నారు. నీరు నిల్వ ఉండే ఎయిర్‌కూలర్స్‌, డ్రమ్ములు, నీటితొట్లు, డబ్బాలు, పాత టైర్లను వారానికోసారి ఖాళీ చేయిస్తున్నారు.

● స్వచ్ఛనగర దిశగా బోడుప్పల్‌

దోమలు ఇంటి ఆవరణంలోకి రాకుండా కిటికీలు, డోర్లకు సన్నటి జాలి పెట్టించుకోవాలని, దోమల కుట్టకుండా దోమతెరలు వాడాలని అధికారులు సూచిస్తున్నారు. దోమలు వృద్ధి చెందే ప్రాంతాలుంటే అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...



పరిశుభ్రత పాటించడంతో పాటు సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

– తోటకూర అజయ్‌యాదవ్‌, మేయర్‌, బోడుప్పల్‌

ప్రభుత్వం చేపడుతున్న నివారణ చర్యలు..

దోమల నివారణ, వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. బహిరంగ ప్రదేశాల్లో నీటి గుంతల్లో ఆయిల్‌ స్ప్రే, దోమలు పెరిగే నీటి నిల్వలను గుర్తించి గాంబూసియా చేపలను వదలడం, కాలనీలు, రోడ్ల వెంబడి ఫాగింగ్‌, శానిటేషన్‌ సిబ్బందిచే రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

వీధికుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు..

ఇటీవల కాలంలో వీధి కుక్కల భారిన అనేక మంది చిన్నారులు, వృద్ధులు పడుతున్నారు. వాటి నుంచి రక్షించుకునేందుకు నగర పాలక సంస్థ టోల్‌ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసింది. సంప్రదించాల్సిన నెంబర్లు 040–27215959, 14420. ప్రజలు కూడా నేరుగా బ్లూ క్రాస్‌ సంస్థ 8886676076, 9848468684, 709366 1908 ఫోన్‌ నంబర్లకు కాల్‌ చేసి ఫిర్యాదు చేస్తే డాగ్‌ క్యాచింగ్‌ టీమ్‌ నేరుగా వస్తుంది. సంబంధిత ప్రాంతంలో ఉన్న వీధికుక్కలను పట్టుకుని స్టెరిలైజేషన్‌ సెంటర్‌కు తీసుకెళ్తారు.

పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

● ఉప్పల్‌లో మండప నిర్వాహకులతో పోలీసుల సమావేశం


మాట్లాడుతున్న పోలీస్‌ అధికారులు

ఉప్పల్‌: మండప నిర్వాహకులు విధిగా తన మండపాలను రిజిస్టర్‌ చేసుకోవాలని, వదంతులు నమ్మకుండా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఉప్పల్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎలక్షన్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు శనివారం ఉప్పల్‌లోని కొమ్మిడి కృష్ణారెడ్డి గార్డెన్‌లో మండప నిర్వాహకులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూచనలు చేశారు. పరిచయంలేని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉప్పల్‌ గణేష్‌ ఉత్సవ సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ పర్యటన

మౌలాలి : డివిజన్‌లోని ఈస్ట్‌ మారుతినగర్‌లో మౌలాలి కార్పొరేటర్‌ సునీతాశేఖర్‌యాదవ్‌ పర్యటించారు. ఈ సందర్భంగా శనివారం కాలనీవాసులు స్థానిక సమస్యలపై కార్పొరేటర్‌ దృష్టికి తీసుకెళ్లారు. తమ కాలనీలో వెంటనే ఆర్‌సీసీ పైపు లైన్‌లో ఏర్పాటు చేస్తే వర్షం వల్ల సమస్యలు ఉండవని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు.

పేదోళ్ల జోలికొస్తే ఖబద్దార్‌ : ఎంపీ ఈటల


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్‌

అల్వాల్‌: అల్వాల్‌లోని ఆనందరావునగర్‌, వాసవీనగర్‌, భరత్‌నగర్‌, జానకీనగర్‌లో చెరువు కింద ఉన్నవారికి నోటీసులు ఇవ్వడంతో శనివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ హాజరై వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలిపని, ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ.. బ్యాంకుల్లో రుణాలు కడుతూ 60–70 గజాల స్థలంలో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న వీరికి ప్రభుత్వం నోటీసులు ఇచ్చి కూలగొడతాననడం బాధాకరమన్నారు. ప్రజలు నోటీసులు వచ్చాయని ఆందోళన చెందొద్దని తాను పోరాడతానన్నారు. పేదోళ్ల జోలికి వస్తే ఖబద్దార్‌ అని ఆయన హెచ్చరించారు. కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి


కమలాకర్‌

కాప్రా: కందిగూడలోని ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని గ్రేటర్‌ హైదరాబాద్‌ కాంగ్రెస్‌ కమిటీ షెడ్యూల్డ్‌ కాస్ట్‌ డిపార్ట్‌మెంట్‌ కన్వీనర్‌ కమలాకర్‌ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కొందరు ప్రైవేటు వ్యక్తులు, స్థానికంగా ఉన్న కొందరు లీడర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే సదరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతూ.. దాడి చేయిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వ భూములను సర్వే చేయించి సంబంధిత అధికారులు రక్షించాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన శ్రీలక్ష్మి సుదర్శన మహాయాగం

అల్వాల్‌: ఓల్డ్‌ అల్వాల్‌ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీలక్ష్మీసుదర్శన మహాయాగం శనివారం ముగిసింది. ఈ యాగానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వెంకట్‌రెడ్డి, ఆలయ చైర్మన్‌ రాజాసంజయ్‌గోపాల్‌ సైన్పూర్‌, కార్యనిర్వాహణాధికారి మఠం వీరేశంచ ఆలయ సిబ్బంది సురేందర్‌, వెంకట్‌రెడ్డి, అర్చకులు రఘుపంతులు, వంశీ పంతులు, శ్రీనివాస్‌ పంతులు, వెంకటరామరెడ్డి, సురేందర్‌రెడ్డి, శివరామకృష్ణ, రామచంద్రరావు, రాజనర్సింహారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.


మహాయాగంలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌

భారీ వర్షాలపై అప్రమత్తం

మేడిపల్లి: వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని పీర్జాదిగూడ మేయర్‌ అమర్‌సింగ్‌ పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ సమావేశంలో అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌లోని ప్రజలు సంప్రదించాల్సిన నంబరు 9154999303. మున్సిపల్‌ కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు, డీఈ సాయినాథ్‌గౌడ్‌, మేనేజర్‌ సుదర్శన్‌, ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి,మాన్‌సూన్‌ సభ్యులు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మేయర్‌ అమర్‌సింగ్‌

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కాప్రా: ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను పంపిణీ చేశారు. మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో తహసీల్దార్‌ సుచరితతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ చెక్కులు ఆలస్యం చేయకుండా లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి

మేడిపల్లి: కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ పథకం పేదల పాలిట వరమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్యాలయంలో శనివారం 188 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీర్జాదిగూడ కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు, తహసీల్దార్‌ హసీనా, మేడ్చల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌, డిప్యూటీ మేయర్‌ కుర్ర శివకుమార్‌గౌడ్‌, కార్పొరేటర్లు, కో–ఆప్షన్‌ సభ్యులు, నాయకులు దర్గ దయాకర్‌రెడ్డి, బుచ్చియాదవ్‌, బోడిగె కృష్ణాగౌడ్‌, ఈశ్వర్‌రెడ్డి, కుర్ర శ్రీకాంత్‌గౌడ్‌, బండి సతీష్‌గౌడ్‌, పప్పుల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


చర్లపల్లి చెరువు వద్ద ఎమ్మెల్యే బండారి, జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌పాటిల్‌

కుషాయిగూడ, కాప్రా: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గణేష్‌ నవరాత్రుల ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. గణేష్‌ నవరాత్రుల ఏర్పాట్లను పురస్కరించుకుని ఎల్‌బీనగర్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌పాటిల్‌తో కలిసి శనివారం కాప్రా, చర్లపల్లి చెరువులను సందర్శించి వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు. చెరువుల వద్ద అన్ని విభాగాల సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. కాప్రా సర్కిల్‌ డీసీ జగన్‌, ఈఈ హరిలాల్‌, ఏఈ కీర్తి స్థానిక నేతలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్‌ ప్రభుదాస్‌

కుషాయిగూడ: మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ డివిజన్‌లో రూ.కోటి 35 లక్షలతో తలపెట్టిన అభివృద్ధి పనులకు శనివారం స్థానిక కార్పొరేటర్‌ ప్రభుదాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతానన్నారు. ఉప్పల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు. అభివృద్ధితో పాటు తనవంతుగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. డివిజన్‌ అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ కార్పొరేటర్‌ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, డీఈ రూప, ఏఈ స్రవంతి, స్థానిక నేతలు గుమ్మడి జంపాల్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, బాలరాజు, రామకృష్ణ, హరినాథ్‌రెడ్డి, కాళిదాస్‌, సత్యనారాయణ, నరేందర్‌, నిసార్‌ అహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఐ రాచకొండ బాబుకు ఉద్యోగ విరమణ వీడ్కోలు



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్‌ రవాణా శాఖలో మోటార్‌ వెహికిల్‌ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాచకొండ బాబు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా మేడ్చల్‌ డిస్ట్రిక్ట్‌ ట్రాన్స్‌పోర్ట్‌ ఆఫీసర్‌ రఘునందన్‌గౌడ్‌తో పాటు పలువురు ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఏఓ రామకృష్ణ, ఇఫ్తికర్‌ ఉద్దీన్‌, మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్స్‌ సాదుల శ్రీనివాస్‌, శిల్పా, అసిస్టెంట్‌ మోటార్‌ వెహికల్‌ త్రివేణిభాయ్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ రమేష్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ జగదీష్‌, సాయి, ప్రణయ, కానిస్టేబుల్స్‌ గంగాధర్‌, శ్రీకాంత్‌రెడ్డి, జంగయ్య, గణేష్‌, రవీందర్‌, ఆఫీస్‌ సిబ్బంది, హోమ్‌గార్డ్స్‌ వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

గంజాయి విక్రేత రిమాండ్‌

మేడిపల్లి: నిషేధిత గంజాయిని అక్రమంగా తీసుకెళ్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్కేసర్‌ మండలం నారపల్లిలోని హనుమాన్‌ ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న మహ్మద్‌ సలీం(40)స్థానికంగా పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా నగరంలోని ధూల్‌పేట్‌లో గంజాయిని కొనుగోలు చేసి శివారు ప్రాంతాల వారికి విక్రయిస్తున్నాడు. శనివారం మల్కాజిగిరి ఎస్‌ఓటీ, మేడిపల్లి పోలీసుల జాయింట్‌ ఆపరేషన్‌లో నారపల్లిలో అతడు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తన బ్యాగులో 500 గ్రాముల నిషేధిత గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



రేపు మల్కాజిగిరి సర్కిల్‌ డీసీతో 'సాక్షి ఫోన్‌ ఇన్‌'

మల్కాజిగిరి: డెంగీ,మలేరియా తదితర వైరల్‌ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో మల్కాజిగిరి సర్కిల్‌లో వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలపై రేపు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డిప్యూటీ కమిషనర్‌ గోధుమల రాజుతో 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్‌ఇన్‌ కార్యక్రమం నిర్వహిస్తుంది. సంప్రదించాల్సిన నంబరు 91548 99636.


గోధుమల రాజు, డిప్యూటీ కమిషనర్‌

అరోరాలో ముగిసిన జాతీయ సదస్సు


జాతీయ సదస్సు ముగింపు వేడుకల్లో ఉపాధ్యాయులు

మేడిపల్లి: పర్వతాపూర్‌లోని అరోరా యూనివర్సిటీలో ఆరురోజులగా నిర్వహించిన ఏఐసీటీఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ శిక్షణ ప్రోగ్రామ్‌ ముగింపు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బాబాఅటామిక్‌ రీసెర్చ్‌సెంటర్‌ సీనియర్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ లలిత్‌సింగ్‌, దత్తమేఘ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఎడ్యుకేషన్‌, రీసెర్చ్‌హానరీ డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీహరికృష్ణ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి అవకాశాలు ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా స్కూల్‌ ఆఫ్‌ కామర్స్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఏఐసీటీఈకి యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

శుభాకాంక్షలు

కాప్రా: ఇటీవలే బదిలీపై కాప్రా సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌గా వచ్చిన జగన్‌కు బీఎంఈయూ కార్మికసంఘం నాయకులు కలిసి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బీఎంఈయూ కార్మికసంఘం సర్కిల్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ రవీందర్‌, సెక్రటరీ సత్యమూర్తి, గంగాధర్‌, శ్రీనివాస్‌, కృష్ణ, తిరుపతి, రామకృష్ణ, దశరథ తదితరులున్నారు.


డిప్యూటీ కమిషనర్‌ జగన్‌తో బీఎంఈయూ కార్మిక నేతలు

నేడు రుద్రహోమం

గౌతంనగర్‌: మాసశివరాత్రి సందర్భంగా గౌతంనగర్‌ డివిజన్‌ ఉత్తమ్‌నగర్‌లోని శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో ఆదివారం ఉదయం 6:30కు రుద్రహోమం, శివుడికి అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నాగరాజుశర్మ ప్రకటించారు.

DOCUMENT LOST

I, JUKURI RAJINI W/o. BALTHU SRINIVAS, Aged About 47 Years, Occ: House wife, R/o. H.No. 2-147, Sai Homes, Gurramguda, Saroornagar Mandal, R.R.Dist, Telangana State, Lost my Original gift deed Document bearing No.4814/2020 at SRO Narapalli While I Was Travelling by bus on 05-08-2024. If any one Found pl. Contact. 8919716668

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657